# "వలస పక్షి"

## గంటేడ గౌరునాయుడు



"నీకెంత శని వక్కరించిందిరో...కొడుకా...
నీకెక్కడా దినం దీరకుంటందిరో ...కొడుకా
కొడుకో...కొడుకా... ...."

వేకువ చీకటి తెరలకు విషాదం పులుముతూ... సన్నగా శోకాలు పెడుతోంది శాంతమ్మత్త. ఊరంతా నిద్రలో జోగుతోంది. అక్కడక్కడా ఇళ్ళ గడపల్లో కుంపట్ల ముందు పొగాకు చుట్టలు అడ్డపొగవేసి కూర్చుని గతంలోకి జారిపోయే ముసలాళ్ళు...

నిద్రపట్టక లేచి డాబామీదికి వెళ్ళేను.

ఆకాశం దట్టంగా మబ్బుపట్టివుంది. ఒక్కొక్కటిగా చినుకులు రాలుతున్నాయి.

డాబా మీంచి చూస్తే వూరంతా... శోకం పులుముకున్న ముసలమ్మలా వుంది... చీకట్లో.

నాకీవూరితో ఎంతో అనుబంధం వుంది.

నాగావళినది... నదిలో యీతలు..., నదివొడ్డున జోగమ్మగారి మామిడితోట... తోటలో ఆటలు. ఇసుక దిబ్బమీద నేస్తాలతో సిగరెట్లు తాగుతూ చెప్పుకునే కబుర్లు.

తాతగారి ఊరు అంటే బాగా యిష్టంగా వుండేది. నెలకో రెండునెలలకో ఒకసారి వచ్చి రెండు మూడు రోజులుండి వెళ్ళడం అలవాటు. వేసవి శలవులైతే... యిక్కడే నా మకాం.

ఊరుచుట్టూ తోటలు. కళ్ళాలలో గుబురుగా పెరిగేచెట్లు..., వేరుశనగ, జనుము, సీమపెండ్లం చేలు... కనుచూపుమేరా కనువిందు చేసేవి. వరిపైరు అలలమీంచి తేలివచ్చే గాలితో వొళ్ళు పులకరించిపోయేది.

ఆ రోజులు గుర్తుకొస్తే చాలు... మనసు తేలిపోతుంది.

చలిగాలి తెర, వానజల్లుతోపాటు- శాంతమ్మత్త ఏడుపురాగాల్నీ మోసుకొచ్చింది:... విసురుగా.

"కొడుకా... కొడుకా..."

శాంతమ్మత్త కొడుకు నారాయణ.

నేను పట్నంనుండి వస్తేచాలు నాతోనే గడిపేవాడు. అందరూ సినిమాల గురించీ సినిమా యాక్టర్ల గురించీ మాట్లాడితే నారాయణ మాత్రం పుస్తకాల గురించి మాట్లాడేవాడు. నాకూ సాహిత్యం అభిమాన విషయం కావడంతో యిద్దరికీ స్నేహం బాగా కలిసింది. గురజాడ, చలం, శ్రీశ్రీలంటే నారాయణకి ఎంతిష్టమో. కన్యాశుల్కం అతనికి పారాయణగ్రంథం, మహాప్రస్థానం గేయాలు నాలుక చివరే వుండేవి. ఇంటర్ దాకా పట్నంలో నాతో కల్సిచదివిన నారాయణ... వాళ్ళ నాన్నగారు పోవడంతో చదువుకు స్వస్తి చెప్పి వ్యవసాయంలో పడ్డాడు. తాను పొందలేని కాలేజీ విద్యను తమ్ముళ్ళకు అందించాలని ఆరాటపడేవాడు. అటువంటి నారాయణ బతుకుతెరువు కోసం పొట్టచేతపట్టుకుని ఎక్కడికో వలసపక్షిలా వెళ్ళిపోయేడని మాఁవయ్య చెబితే నాకేదోలా అయిపోయింది.



గౌరునాయుడు

ఉద్యోగరీత్యా రాజస్థాన్ వెళ్ళిపోవడం వల్ల నేనీవూరు రావడం కుదరలేదు. పదేళ్ళు దాటే వుంటుంది. మళ్ళీ యిన్నాళ్ళకి నారాయణ గురించి అడిగేను మాఁవయ్యని. తల్లీ... తల్లికన్నా మిన్నగా చూసుకునే మడిచెక్కల్నీ... ఇంటినీ వొదిలి ఎందుకు వెళ్ళిపోవాల్సి వచ్చిందో. మాఁవయ్య జీవంలేని నవ్వు నవ్వేడు. 'రేపు నా పరిస్థితీ యిదే' అన్నట్టుంది ఆ నవ్వు. 'మడిసెక్కల మీది మమకారం వల్లే నారాయణ ఊరొదిలి ఎలిపోయేడ్రా...' అన్నాడు.

ఊరు నాకు తెలిసినప్పట్లాగా లేదు. అయినా పైకి బాగానే కనిపిస్తోంది. వ్యాపారపంటలతో పచ్చగా కళకళలాడుతోంది. ప్రతిపొలంలోను మోటార్లు. అక్కడే ఇళ్ళూ. అక్కడక్కడా కనిపించే ట్రాక్టర్లు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నట్టున్నారు... మరి వీళ్ళకేమయ్యింది? నారాయణేకాదు... అప్పటి మిత్రులు శివరాం; కృష్ణ; సత్యం కూడా... వీళ్ళందరూ పొలం పనుల్లో ఎంత సంతృప్తిని ప్రకటించేవారు. "తల అమ్ముకోని బతకడం కంటే స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకోవడంలో ఎంత ఆనందం వుందో తెల్సా..."అనేవాడు శివరాం.

ఒకసారి వాళ్ళందరూ గడ్డికోతకు వెళ్తుంటే నేనూ వెళ్ళేను సరదాగా. నేనూ గడ్డికోసి చూస్తానని శివరాం వద్దంటున్నా వినకుండా కొడవలి తీసుకుని వేలు తెగ్గోసుకున్నాను. నారాయణ కంపురొడ్డ ఆకులు నలిపి గాయంపై అద్ది కట్టుకట్టేడు. "ఒరే బావ్- పెన్నుపట్టుకోని రాయడం కాదురా కొడవలితోటి గడ్డి కొయ్యడమంటే" కృష్ణ హాస్యమాడేడు. ఇప్పటికీ నా ఎడమ చేతి నడిమివేలి మీద 'నెలవంకలా' తెగిన గాయపు మచ్చ.

ఆరోజు నారాయణ వాళ్ళ పొలంలో జొన్నపొట్టలు నిప్పులమీద కాల్చడం నాకిప్పటికీ గుర్తే. గింజలు మాడిపోకుండా రేకుల మీదనే కాల్చడం ఎంతబాగుందో.

ప్రతిరోజూ తోటల్లోనో ఇసకదిబ్బమీదనో సిగరెట్లతో పొగమేఘాలు సృష్టిస్తూ చెప్పుకునే కబుర్లు మరుపుకు రావు.

ఆ తోటలేవీ...? ఆ మిత్రులేరీ??

నాకు ఊరు కొత్తగా వుంది. ఊళ్ళో తేలియాడే గాలిలోనూ కొత్తదనం. కొత్త మనుషులు... కొత్త మాటలూ... నాకే కాదు... ఊరుకీ .

ఊరుకేదో అయ్యింది. దెబ్బతిన్న పిట్ట గూట్లో ముడుచుకుపోయినట్టుంది ఊరు.

వీధిలో ట్రాక్టర్ స్టార్టయిన చప్పుడు ఆలోచనల్లోంచి నన్ను బయటపడేసింది.

చీకటి క్రమంగా పలచబడుతోంది. చినుకులుగా రాలుతోంది.

వేకువ ఎంత మనోహరంగా వుండేదిక్కడ. ప్రతీ యింట్లోంచీ చల్లచిలికే చప్పుడు... మంద్ర మంద్రంగా. కోటేరేసిన నాగళ్ళ ఏటికర్రలు నేలకు రాస్తూ చేసే చిత్రమైన శబ్దం... వెనుక ఎడ్లను అదిలిస్తూ రైతులు తీసే కూనిరాగాలు. సాలల్లో ఆవుల పొదుగుల్లోంచి తపేళాలలోకి జారుతున్న పాలధారల సవ్వడి. ఇళ్ళపెరళ్ళలో చెట్లమీద పిట్టల అరుపుల సందడి ఎంత అద్భుతమైన సంగీతమది.

ఎవరో కసురుతున్నారు శాంతమ్మత్తని. చూస్తే మాఁవయ్య.

"శాంతప్పా... ఎందుకలగ ఏడుత్తావు? ఏడిసియేడిసి గుండి ఎండబెట్టుకుంతావేటి? ఆ... అన్ని నోటికి ఆసిపునేదు. యిప్పుడేటయ్యింది? నీ కొడుకులు నీ దగ్గర నేరు. అయితేటి? మామందరం లేమేటి? నీ కొడుకుల్ని యిప్పుడికిప్పుదు తెమ్మంతే తేనేనుగానీ... యింకేటడుగుతావో అడుగు. మిట్టకాయేస్సరికి తెచ్చి నీ సేతల పెడతాను. ఇదా సుట్ట తాగుతావు గావాల." లాల్చీ జేబులోంచి పొగాకు చుట్టతీసి యిచ్చేడు. ఇచ్చి... "కోడలు టీ పంపించుతాది- తాగు"

అని వీధిలోకి వెళ్ళిపోయేడు.

శాంతమ్మత్త మంచం మీద మోకాళ్ళకు తల ఆన్చి మౌనంగా రోధిస్తోంది. పెచ్చులూడుతున్న మిద్దింటి గోడ గూటిలో మినుకుమినుకు మంటున్న దీపం కొడిగట్టి ఆరిపోడానికి ఆరాటపడుతున్నట్టుంది.

దాబాడిగి ఆ యింటికెళ్ళేను. ముంజూరు దగ్గర నిలబడి 'శాంతమ్మత్తా' అని పిలిచేను. "ఎవులూ..." కళ్ళు చికిలించి చూసింది. మసక చీకటిలో నీడలాగా వున్న నన్ను గుర్తించడం కష్టమే. అందులోనూ ఆమె నన్నుచూసి పదేళ్ళు దాటింది.

"దీపాలు ఆరిపోనాయి నాయినా... సరిగ్గ ఆనదు. ఎవుర్రాబావ్ నువ్వు"

"నేనత్తా... చిన్నం నాయుడ్ని. నువ్వెప్పుడూ 'సిన్నోడిమూ' అని పిలిచేదానివి..."

"ఓరే... నువ్వేన్రా... ఎప్పుడొచ్చినావురా... ఎన్నాలయ్యిందో నిన్ను నూసి. యిప్పుడికి గేప్కమొచ్చిందా తాతగారి వూరు? ఆ దిగవ దేశింకాసి ఎలిపోనావట. అప్పుడుకాసి మరి రాడమే మానీసినావు. రా... రా... బావూ కూకో."

ఆ గొంతులో అంతదాకా గూడుకట్టుకున్న దుఃఖపు తెరల్ని తుడిచేసి గుండెలోని ఆప్యాయత గొంతులో నింపుకుని అంది. మంచం దండిమీద కూర్చున్న నా వొళ్ళంతా తడిమింది.

"వతన కాసేనా రావడం? మాయమ్మి... పిల్లలు అందరు కులాసగున్నారా? అన్నట్టిగ ఎందరేటి పిల్లలు, ఆళనీ తెచ్చినావా?"

"ఇద్దరాడపిల్లలు... వాళ్ళని తీసుకురావడం కుదర్లేదు."

"ఏట్రా... ఇద్దరూ ఆడపిల్లలేనా? పోన్నే ఆడపిల్లలైతే యేటిబోయింది. ఆళేనయం. సత్తప్పుడు ఏడనైనా ఏడుత్తారు. మొగగుంటలున్నారంతే ఎప్పుడు సత్తారా... యీడిసిద్దుమా అని సూత్తారు. ఆడ పిల్లలకి లచ్చో... రెండు లచ్చలో కట్నం యిచ్చీసి పెళ్ళిసేసీసి తగిలిత్తే అంతటితోటి తెగిపోద్ది. మొగపిల్లలకి అలగవ్వదు కదా. ఆళ సదువులకీ వుజ్జోగాలకీ... ఎన్నెన్ని పర్రాకులు పడాలో. అయినా యీ కాలంల ఆడపిల్లలేటి, మొగపిల్లలేటి. అందరూ ఒకటే..."

"మా పెద్దోడికీ కూతురే. పిల్ల గొప్ప గడుసనుకో. నాయనమ్మా... నాయనమ్మా అని సిటం వొదిలీది కాదు. అక్కడెలాగుందో. తనువులపడితే కడుపు దేవెత్తాది. సెవులిల్లుగట్టుకోని సెప్పినాను. 'ఒరే నాయినా నా మాట ఆలకించురా... అక్కడ సేసిన పనే యిక్కడా సేసుకుంతే... నీ కూడు కుక్కలు తినాలా' అంతే నా మాట కాతర సేసినాడు కాదు. కొడుకు... రాజునాగ బతికిన వూర్లోన కూలోడినాగ బతకడమంతే... అదెంత కష్టంగుంతాది. అందుకే తెగించీసి ఐదరాబాదు ఎలిపోండు. 'అక్కడ మనూరోలు బోల్డుమంది వున్నారు. ఆల్తోటే నానున్నా' అని మనసు రాయి సేసుకోని. నానిక్కడ దెయ్యింనాగ యిలగున్నాను."

'నిజఁవే... ముగ్గురు కొడుకులుండీ... అదీ యీ వయసులో... బాధాకరమే. శాంతమ్మత్తను చూస్తే జాలేసింది.

"రాజు, కృష్ణ ఏమయ్యారు? ఏం చేస్తున్నారు? ఇద్దరూ... తెలివైన వాళ్ళే; రాజు కవిత్వం కూడా రాసేవాడు."

"ఆల సంగతేటంతే యేటి సెప్పమంతావురా నాయినా. ఒక్కొక్కలు కాసిన కానుపు అంతే. నేపోతే యేటి! ముగ్గురు కొడుకులు భీముళ్ళాటోలు... అరిసేతుల్ల పాదాలుంచి నడిపించుతారు నిన్ను అనీవోలు అందరున్ను. ఆకరికి యిలగయ్యింది. నాగాచ్చారమిలగుంది. నీకు తెల్దా... రాజు కవితలు... పొస్తకాలు అనుకోని తిరిగోడా. అదేటో సంగమన్నాడు. ఆ సంగపోళతోటి తిరిగి... తిరి

ఆ గొంతులో అంతదాకా గూడుకట్టుకున్న దుఃఖపు తెరల్ని తుడిచేసి గుండెలోని ఆప్యాయత గొంతులో నింపుకుని అంది. మంచం దండిమీద కూర్చున్న నా వొళ్ళంతా తడిమింది

గి... అడివి పట్టీసినాడు."

"ఔనౌను... రాజు, సంఘాలు... విప్లవాలు అంటూ ఇల్లు పట్టకుండా తిరుగుతున్నాడనీ... వాడి పరిస్థితే ఆందోళన కలిగిస్తుందనీ... రాసేడు" - 'అసలీ ఉద్యమాలు... విప్లవాలు... యివన్నీ మనదేశానికి సరిపడతాయంటావా? పేదల రాజ్యం సాధ్యమేనంటావా? అందుకోసం ఆయుధం తప్ప మరో మార్గం లేదా?... ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు వేసేడు. తన మీద తనకు అచంచలమైన విశ్వాసము, భవిష్యత్తుమీద ఎంతో ఆశ... వున్న నారాయణలో కొంత నిరాశ చోటుచేసుకున్నట్టనిపించింది ఆ వుత్తరం చూస్తే. అదే నారాయణ రాసిన చివరి వుత్తరం. ఆ తరువాత యిద్దరి మధ్యా ఉత్తరాలు ఆగిపోయేయి. అందుకు ప్రత్యేక కారణాలేవీ లేవు..."

"నాకైతే సదవడం కుదర్లేదు... నువ్వయినా సదువురా... అని ఎంత బతిమాలినాడనుకున్నావు పెద్దోడు. అచ్చా... పేదల రాజ్జం తెత్తానని ఎల్లేడు. అదా అలగెల్లినోడు నిరుడీ యెగలప్పుడు ఒకరోజు కోడిగూజ్జామప్పుడు వొచ్చినాడు కొడుకు. 'ఆకలేత్తంది' అన్నాడు. ఎప్పుడు తిన్నాడో ఏటి తిన్నాడో. 'కోడిగుడ్డ అట్టుపోత్తాను తినీసెల్రా' అన్నాను. ఏల మించిపోతందని గాబరగాబరగ పిండొడింతోటి రొండు ముద్దలు తిని గిన్నిడు గెంజి తాగి వొచ్చినోడు వొచ్చినట్టగే ఎలిపోండనుకో. 'పేదల రాజ్జం వొత్తాది... అందరం కల్సి అప్పుడు తిందుము కోడిగుడ్లు అట్లు పోసుకోని' అన్నాడు కొడుకు.

పెపంచికిం పాపాత్ముల సేతల వుంతే, ఒకడు పోతే వందమంది పాపాత్ములు పుట్టికెలిపోస్తుంతే పేదల రాజ్జం వత్తాదంతావా అంతా మీ బెమగాని... ఎందుకీ రత్తాపోరు... అనంతే నవ్వీసోడు...

నవ్వీసి 'అమ్మా పేదల రాజ్జం తప్పకుంట వత్తాదే... అయితే కసింత వోపికి పట్టాల; ఏదీ అనుకున్నయెంటనే అయిపోద్దేటి? నువ్వైనా తొమ్మిదినెలలు మొయ్యకుంట... పురిగినొప్పులు పడకుంట... వొంటిలోని రత్తం రుదా సెయ్యకుంట నన్ను కనీసినావా సెప్మి... అలగేమరీ'... అని యింకేటేటో సెప్పీవోడు. పేదల రాజ్జం వొత్తాదో రాదో; అందరూ గుడ్డు గులకల్తోటి బువ్వతింతారో నేదో గాని ఆడలగ అడివి పట్టీసినాడు. అందరమూ కడుపులోన సల్ల కదలకుంట కాలుమీద కాలేసుకోని కూకుందు మనుకుంతే, లోకం నడ్డమెలాగా? పోన్నే నా కొడుకు అందర్లాటోడు కాదు... గొప్పోడు... ఎవులు మాత్రం వుగమ్మీద వుండిపోతారా వుట్టిగట్టుకోని' అని మనసుకి బోదపరుసుకున్నాను. పెద్దోడుకి మాత్రం నడుం నక్కున యిరిగిపోయినట్టగయిపోయింది."

"నిజఁవే... రాజు అలా చేయడం నారాయణను బాగా కృంగదీసి వుంటుంది. 'రాజు బాగా చదువుతాడని... వాడి భవిష్యత్తు ఎంతో బాగుంటుందనీ' అంటుండేవాడు నారాయణ."

"ఆడెలిపోయింతరవాత ఊరు తీరవేమారిపోయింది. పెద్దపెద్ద మోతుబరి రైతులు సొమ్ముసంచులతోటి దిగబడ్డారు. గోవుపాదమంత మెరకనేకుంట కొనీసి యవసాయాలు సెయ్యడం మొదలెట్టేరు. మనలాటి సిన్నాసితక రైతులు ఆల్తోటి పోటీపడలేక... యవసాయాలు సెయ్యలేక బేబిచ్చైపోన్రనుకో. బూఁవులు ఆళకే సిస్తుకో, పాలుకో అఁవిరిసీసి ఊరొదిలి ఎలిపోడం పేరంబించినారు. ఒక్క మన యీదిలోనే పదిహేను కుటుంబాలు ఐదరాబాదు... యిజయవాడ... అందంటందంట ఎలిపోన్రు. అలగైనా మడిసెక్కలు మిగులుతాయని ఆశ. ఇదంతా సూసినాడు సిన్నకొడుకు. సదివినా వుజ్జోగం రాదు... యవసాయమూ గిట్టుబాటు కాదు అనీసి... మిలట్రీల సేరిపోతనన్నాడు. అలగే సేసినాడు. పెద్దోడు పాపం ఏటంతాడు? ఇప్పుడు అక్కడెక్కడో వుద్దం జరుగుతందంట... ఆడు ఎల్లడమూ... వుద్దం రావడమూ... అంతా నాగాచ్చారం. అలగంతే ఇస్కూలు మేస్టగారు నేరా... అతగాను... 'శాంతమ్మా... నీ కొడుకు లాటోళు వుద్దల దెబ్బలాడబట్టే మనమందరం యిక్కడ యిసరాయంగ వుండగలుగుతున్నాము. నీలాటి అదుష్టము అందరికీ రాదు... నువ్వు గొప్ప తల్లివి సుమా...'" అంతారు.

"కదా మరి... నీ త్యాగం అందరూ చేయగలుగుతారా..." అన్నానేగానీ... కుడిఎడమ చేతుల్లాగ వుండాల్సిన తమ్ములిద్దరు... ఏకాకిని చేసి వెళ్ళడం నారాయణనీ, శాంతమ్మత్తనీ... ఎంత కృంగదీసిందో తెలుస్తూనే వుంది.

"ఇద్దరు కొడుకులూ సిందవల మీద స్వోరీ సీస్తంర్రు. అలగ ఎంతసేపో... ఎప్పుడో అవి కిందపడీకా తప్పదు; ఆళ్ళని తినీకా తప్పదు; ఆ కవురు నాను ఆలకించకా తప్పదు. అయినా మనసు రాయిజేసుకోని 'నా కొడుకులు గొప్పోలు' అని నాకు నానే బోదపరుసుకుంతన్నాను. అయితేటి...? కన్న కడుపు, పేగుకదిలి పేనం కలుక్కుమంతాది."

శాంతమ్మత్త చెప్పడం ఆపి కళ్ళు ముక్కు తుడుచుకుంది.

బయట చీకటి క్రమంగా పలచబడుతోంది. మసక వెలుతురు పల్చని తెరలా జీరాడుతోంది.

నేనూ మౌనంగా వుండిపోయేను. 'ఆగిపోకు చెప్పు' అన్నట్టు అత్త ముఖంలోకి చూసేను. పొడవాటి నిట్టూర్పు విడిచి మళ్ళీ చెప్పడం మొదలెట్టింది.

"నాను కాపరంకి వచ్చీసరికి బోల్డు ఆస్తి. బండిడు సంసారం ఎత్తీ దించినాను. ఆ సరుకులేటి... సప్పర్లేటి? అయితేటి సెరలచ్మి. ఎప్పుడు ఎవల దగ్గిరికి సేరతాదో సెప్పలేం. ఎలగ అరాయించుకుపోయిందో అంత ఆస్తి. ఒకసారి వరదలొచ్చీ, మరొకసారి వానల్లేక పంటలు పోవడం; అప్పులు



సదివినా వుజ్జోగం రాదు... యవసాయమూ గిట్టుబాటు కాదు అనీసి... మిలట్రీల సేరిపోతనన్నాడు. అలగే సేసినాడు. పెద్దోడు పాపం ఏటంతాడు? ఇప్పుడు అక్కడెక్కడో వుద్దం జరుగుతందంట... ఆడు ఎల్లడమూ... వుద్దం రావడమూ... అంతా నాగాచ్చారం. అలగంతే ఇస్కూలు మేస్టగారు నేరా... అతగాను... 'శాంతమ్మా... నీ కొడుకు లాటోళు వుద్దల దెబ్బలాడబట్టే మనమందరం యిక్కడ యిసరాయంగ వుండగలుగుతున్నాము. నీలాటి అదుష్టము అందరికీ రాదు... నువ్వు గొప్ప తల్లివి సుమా..." అంతారు



మా అనారోగ్యానికి తోడు పాపకు యీమధ్య జొరం. వొచ్చిన జొరం వొదల్దం లేదు. డాక్టర్‌కి చూపించేను. అయినా ఫలితం కనిపించడంలేదు. అదేటో సుఖాలైనా... కష్టాలైనా కట్టగట్టుకుని ఒకసారే వస్తాయి. అయితే రెండోవే మన దగ్గరికి వస్తాయి. ఇద్దరికీ వొచ్చిన రోజుకూలిలో ఎంతోకొంత మిగిల్చుకోలేమా అనుకునేవాణ్ణి. ఇక్కడ ఇలా జీవనం సాగిపోతే అక్కడ మడిచెక్కలు నిలబడతాయని ఆశ. ఆ భూమి మీద ఆశతోనే ఊరుదాటి వచ్చేను. అయినా 'దినందీరడం' లేదు. చేతిలో పైసలు లేవు. మనవాళ్ళు యిక్కడ వున్నా వాళ్ళని ఎలా అడగగలను. నేనెంతో వాళ్ళూ అంతే. దరిద్రగొట్టోడు తలగడిగితే వడగళ్ళవాన పట్టుకుందట

తెచ్చి మదుపులు పెట్టి యవసాయాలు సెయ్యడం. పంటలు కలిసిరాకపోవడం. 'వడ్డీలకి వడిగుర్రాలు సాలవంతారు. తెచ్చిన అప్పులు 'తడిసిమోపిడై' ఎకరాకిఎకరా అమ్మిడం. దానికి తోడు తగువులూ తంటాలు. తెలుగుదేశిం, కాంగిరేసని బుర్రలు బద్దలుగొట్టుకోడం... అలగ సేసేగదా మీ మామ పెద్దల్ల కలిసిపోండు. అక్కడ కాసి పట్టీసింది శని ఇంటికి. ఏటి సేద్దుమనుకున్నా ఆకున అందదు - పోకని పొందదు. ఇక యవసాయం అంతావా...ఆ దొరల్తోటి పోటీపడి సెయ్యగలమా. యిక్కడి మనుసులే మన పక్క నిలబడీరు... మన పనులకి రారు. అది సూసినాడు పెద్దకొడుకు. 'ఉన్న మడిసెక్కలైనా మిగలాలంటే వూరొదిలి ఎలిపోవడమే మార్గం' అన్నాడు. మడిసెక్కలు సిస్తుకిచ్చీసి పెళ్ళాన్ని, పిల్లని తీసుకోని ఐదరాబాదు ఎలిపోయి అక్కడేదో పని చేసుకుంతండు."

"ఎంత మార్పు! ఇప్పుడు రైతులు వలస పక్షులు. వ్యాపారం సంప్రదాయ వ్యవసాయాన్ని కాళ్ళకింద తొక్కిపట్టి రైతుల్ని బికారుల్ని చేయడం చూస్తే... నాకు భయం వేసింది. ఇంకేంకానుందో.

"ఒరేబావ్ నడిపోడు అడివి పట్టీసినా. సిన్నోడు మిలట్రీల సేరిపోయినా నాకు బాద నేప్పోయింది. ఎందుకంతావా... ఆళు సవ్వడంకే తెగించి ఎల్లేరు. ముచ్చుదేవతకి ముద్దులాడ్డంకే ఎల్లేరు. సావు కోరుకున్నోడికి సముద్రం మొలబంటిడు. ఆళ్ళ సావుతోటి పదిమందిని బతికించుతారు. సచ్చిపోయినా నలుగురు నోళ్ళల్ల బతికేవుంతారు. కానొరే బావ్... నా పెద్దకొడుకు నారాయణ బతుకుమీద ఆశతోటి ఎల్లేడు. సత్తిగాలపోడు. నోటిల నాలికి లేనోడు. ఎలగ బతుకుతున్నాడో కడుకు. 'రైతేరాజని... సొతంత్రంగ బతకడమే గొప్పతనమని ఎంతో గొప్పగ సెప్పీవోడు. కల్లం గట్టున పుట్లుకొద్దీ దాన్నిం పాలేర్లకి కొలిసిన కొడుకు ఎవల దగ్గిర కూలికి కుదురుకున్నాడో..."

దుఃఖంతో ఆమె గొంతు పెగల్లేదు.

నాకెలా వూరడించాలో తెలీలేదు. నారాయణకీ పరిస్థితి రావడం నాకు భరింపరాని బాధగా వుంది. మనసంతా వికలమైపోయింది. ఈ వూరు రాకుండా వున్నా బాగుండేదేమోనని కూడా అనిపించింది.

కొంతసేపు ఎవరమూ మాటాడలేదు.

నేను వీధిలోకి చూస్తుండిపోయేను.

తెల్లారడానికింకా సమయం వున్నట్టుంది.

ఆకాశం మబ్బుపట్టి శాంతమ్మత్త ముఖంలా... శోకం మూటగట్టినట్టుంది.

ఏదో గుర్తొచ్చినట్టు మంచం తలాపున బొంతకింద దాచిన కాగితమేదో తీసింది.

"బావూ- యిది సూడిమీ... పెద్దోడు రాసినాదు. ఆ గంటేడి సత్తిం నేదా అతగానికి. ఏది సెప్పాలన్నా అతగానికే సెప్పుతాడు. సత్తింనాయుదంతే పెద్దోడికి గొప్పగురి. పదిరోజులయ్యింది రాసి. ఏటి రాసినాడోగాని అడిగితే 'అందరూ బాగున్నారు. సంకరమానంకి వత్తామని రాసినాదు' అని సెప్పినాడు. ఆ సెప్పడం సూత్తే ఏదో మరమ్ము దాస్తన్నడనిపించుతుంది. మనసుండబట్టక సత్తింనాయుడి కూతుర్ని అడిగినాను ఉత్తరం యిమ్మని. రాత్రి తెచ్చియిచ్చింది.సదివిమీ ఏటి రాసినాడో"... బుడ్డీవొత్తి కొంచెం పైకెత్తి దగ్గరగా తెచ్చి ఆశగా చూసింది.

నారాయణ చేతిరాత కుదురుగ్గా వుంది. 'కుదురులేంది అని బతుకే'.

**పూజ్యులు పెదనాన్నగారికి,**

నమస్కారములు.

మీరు క్షేమమని తలుస్తాను. మా 'అమ్మ' ఆరోగ్యం బాగుందనే అనుకుంటాను. ఇక్కడ మేము క్షేమమని రాయలేను. ఎందుకంటే... ఇక్కడికి పొట్టచేత పట్టుకుని పనికోసం తిరగడంతోనే బతుకు యుద్ధం ఆరంభమైంది. యుద్ధంలో కుశల ప్రశ్నలా...?

చిన్న అద్దెఇల్లు... ఇల్లు అనడం సరికాదు. తాటికమ్మల గుడిసె. ఇరుకిరుకు బతుకు. కొద్దిరోజులు ఇళ్ళకట్టు పనుల్లో... ఇసక, ఇటుకల తట్టలు మోసేము. ప్రస్తుతం యిద్దరమూ ఒక మందుల తయారీ కంపెనీలో చేరేము. ఇద్దరికీ నూటపదిరూపాయలు యిస్తున్నారు రోజుకి. పాపను బడిలో చేర్పించాను.

మందుల కంపెనీలో మొదట బాగానే వుండేది. కాని యిప్పుడు అర్థమౌతుంది అక్కడ ఎవ్వరూ ఎక్కువకాలం పనిచేయలేరని. మీ కోడలి ఆరోగ్యం పాడయింది. ఓ రోజు నోటమ్మట రక్తం పడింది. అదసలే వోటిమనిషి కదా... తట్టుకోలేకపోతోంది. అందుకే దాన్ని ఇంట్లోనే వుంచి నేను మాత్రమే పనిలోకి వెళ్తున్నాను... వొళ్ళు సహకరించకపోయినా. మా అనారోగ్యానికి తోడు పాపకు యీమధ్య జొరం. వొచ్చిన జొరం వొదల్దం లేదు. డాక్టర్‌కి చూపించేను. అయినా ఫలితం కనిపించడంలేదు. అదేటో సుఖాలైనా... కష్టాలైనా కట్టగట్టుకుని ఒకసారే వస్తాయి. అయితే రెండోవే మన దగ్గరికి వస్తాయి.

ఇద్దరికీ వొచ్చిన రోజుకూలిలో ఎంతోకొంత మిగిల్చుకోలేమా అనుకునేవాణ్ణి. ఇక్కడ ఇలా జీవనం సాగిపోతే అక్కడ మడిచెక్కలు నిలబడతాయని ఆశ. ఆ భూమి మీద ఆశతోనే ఊరుదాటి వచ్చేను. అయినా 'దినందీరడం' లేదు. చేతిలో పైసలు లేవు. మనవాళ్ళు యిక్కడ వున్నా వాళ్ళని ఎలా అడగగలను. నేనెంతో వాళ్ళూ అంతే. దరిద్రగొట్టోడు తలగడిగితే వడగళ్ళవాన పట్టుకుందట"

ముఖ్యంగా... యీ పరిస్థితుల్లో ఏంచెయ్యాలో నాకేమీ తోచడంలేదు. నువ్వేం చెప్తావో అని నీ సలహా కోసం రాస్తున్నాను. నీకు తప్ప చెప్పుకోడానికి అక్కడెవరున్నారు.

ఉత్తరంతోపాటు 'ఐదువందల రూపాయలు' పంపిస్తావని ఆశిస్తున్నాను. అసలీ ఉత్తరం రాడయంలో ప్రధానమైన ఉద్దేశం యిదే. 'చల్లకొచ్చి ముంత వెనక్కి దాచినట్టు' అసలు ముక్క వెనక్కి వుంచేను అంతే.

'ఎక్కడైనా బతుకు యుద్ధమేననీ... యుద్ధం మాత్రమే మనిషిని బతికిస్తుందనీ' ఎక్కడో చదివేను. నిజమే కదూ!

నీ ఉత్తరం కోసం ఎదురుచూస్తాను.

ఉంటాను.

మీ
నారాయణ

ఉత్తరం చదవడం పూర్తయ్యేసరికి నా గుండె బరువెక్కిపోయింది. నేను ఉత్తరం చదువుతున్నంతసేపు శాంతమ్మత్త నా ముఖాన్నే చదువుతున్నట్టుంది.

"ఏటి రాసినాడు బావ్..." ఆతృత.

నాకేం చెప్పాలో అర్థం కావడంలేదు.

'ఇద్దరు కొడుకుల్ని యుద్ధాలకు పంపించి, కొడుకుల్ని కొబ్బరికాయల్లా మృత్యుదేవతకి నైవేద్యంగా యివ్వడానికి జంకని తల్లి' బతుకుకోసం వెళ్ళిన కొడుకుకోసం తపించిపోతోంది. బయటి ప్రపంచంకంటే యుద్ధరంగమే భద్రతనీ... గొప్ప జీవితాన్ని యిస్తుందని భావిస్తోందా యీ తల్లి...!

"ఏటలగ బెల్లం కొట్టిన రాయిలాగ వుండిపోనావు? ఉలుకుపలుకూ నేకుంట మిడతా మిడతా సూత్తావేటి? పెద్దోడికి బాగునేదా... కోడలికా? నేప్పోతే మనవరాలిగ్గాని యేటయ్యిందా? బిరాల సెప్పురా..."

నా మౌనం శాంతమ్మత్తలో అనుమానాలకు తావిస్తోందని తెల్సు. అయినా నిజం చెప్పడం వల్ల ప్రయోజనం? ముసల్దాన్ని కష్టపెట్టడమే... అందుకే ముఖం ప్రసన్నంగా చేసుకుని అన్నాను.

"అదేం కాదత్తా... పాపకు యీ మధ్య జొరం వచ్చి తగ్గిందట. ముఖ్యంగా చేస్తున్న ఉద్యోగం కంటె కొంచెం మెరుగైన దానికోసం ప్రయత్నం చేస్తున్నాడట. అందుకోసం డబ్బు అవసరమనీ రాసేడు."

నా మాటలు నమ్మినట్టు లేదు. ఆమె చూపులు ఉత్తరంలోని అక్షరాల్ని నా ముఖంలోంచి పీల్చుకున్నట్టున్నాయి.

"ఒరే బావ్... నాను సదువులేనిదాన్నేగాని లోకం తెలీని దాన్ని కాదురా. అబద్ధం ఎందుకు సెప్తావుగానీ... ఏటి రాసినాడో సెప్పరా."

చెప్పక తప్పలేదు...

శాంతమ్మత్త ఏడుపులోకి జారిపోయింది.

"...బంతినాగ వుండీదానివే అమ్మీ...

నబ్బరి బొమ్మనాగ వుండీదానివే అమ్మీ

కోడిపిల్లనాగ కాళల్ల తిరిగేదానివే అమ్మీ..."

సముదాయించడం నాకు చాతకాలేదు.

బయట చినుకులు వర్షంగా మారి ముంజూరు నుండి ధారలు కదుతోంది. తూరుపు తెల్లబడుతున్నా వీధి మసకమసకగా ముసుగేసుకున్నట్టుంది. ఆ ముసుగును జారేసుకుంటూ ఒక ఆకారం మా వేపే వస్తోంది. నెమ్మదిగా... నీడలాగా...

ఆ నడక నాకు సుపరిచితమైందే.

అతడు

పెరిగిన గడ్డం... లోతుకుపోయిన కళ్ళు... చిక్కిపోయిన వొళ్ళుతో నారాయణ.

"నారాయణా..." సంభ్రమంగా పిలిచేను. కాదు. అరిచేను.

"ఎవులూ... పెద్దోడా...?!" ఆశ్చర్యానందాలతో మంచంలోంచి లేచింది శాంతమ్మత్త.

"మనవరాలూ... కోడలు యేరీ. ఎనకాల వత్తన్నారేటి?"

శాంతమ్మత్త ముఖం విచ్చుకున్న వేకువ మొగ్గే అయ్యింది.

నారాయణ ముంజూరు కింద నిలుచున్నాడు వర్షంలో తడుస్తూ నిర్వికారంగా... ,నిశ్చలంగా... మౌనంగా.

నారాయణని అలా చూస్తుంటే నాకు భయం వేసింది.